క్లుప్తంగా

వాటర్ ఫిల్టర్ అందజేత



ఫిల్టర్ వద్ద చంద్రకాంత్, తదితరులు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఇదే మండలంలోని హజ్గుల్ గ్రామానికి చెందిన కదం చంద్రకాంత్ రూ.15వేలతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయించారు. గురువారం ఎంఈఓ సుభాష్ ఫిల్టర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు దాతను అభినందించారు. కాంప్లెక్స్ హెచ్ఎం రమణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజిని, ఉపాధ్యాయులు రవి, భూమేశ్, గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి, శ్యామ్‌రావు, లక్ష్మణ్, హైమద్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

నర్సాపూర్ (జి): ఇటీవల హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై జరిగిన కాంగ్రెస్ నాయకుల దాడిని బీజేపీ నాయకులు ఖండించారు. ఈమేరకు గురువారం నర్సాపూర్(జి)లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, నాయకులు మిట్టపల్లి రాజేందర్, దత్తురాం, సవీన్, పల్లపు రాజు, కోడె సుధాకర్, విజయ్, సాయికృష్ణ, మహేశ్, బూత్ అధ్యక్షుడు రాజు, శంకర్, చిట్టి, రాము, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మాజీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖానాపూర్: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ మాజీ ఎంపీ బిదూరి రమేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి పిలుపు మేరకు గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేపట్టారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోర్తాటి వంశీ, బోడికె సంతోశ్, మండల ఉపాధ్యక్షుడు సొన్న మహేశ్, నాయకులు రాహుల్, మెస్రం హరి, ఎంబడి విజయ్, వంశీ, శ్రావణ్, నవీన్, రమేశ్, యోగి తదితరులున్నారు.

ఇంటింటికీ వెళ్లి.. రక్త నమూనాలు సేకరించి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో గురువారం పలువురు వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. బీపీ, షుగర్, రక్తహీనత లోపంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం రక్త నమూనాలను జిల్లా కేంద్రానికి పంపి.. వచ్చిన ఫలితాల ఆధారంగా మందులు అందిస్తామని పేర్కొన్నారు. హెచ్ఈవో హరికుమార్ గౌడ్, ఏఎన్ఎం యాస్మిన్, ఆశావర్కర్ లక్ష్మీ తదితరులు ఉన్నారు.

కడెం బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్



కడెం: బీజేపీ మండలాధ్యక్షుడిగా మండలంలోని ఉడుంపూర్ గ్రామానికి చెందిన కాశవేణి శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన మండలాధ్యక్షుల నియామకాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ప్రకటించారు.

బీజేపీ కన్వీనర్‌గా సాయన్న



లోకేశ్వరం: బీజేపీ మండల కన్వీనర్‌గా మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన బొడికె సాయన్నను నియమించినట్లు జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. సాయన్న మాట్లాడుతూ తన నియామకానికి సహకరించినందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

‘ముక్కోటి’కి ముస్తాబు..



నిర్మల్‌లోని దేవరకోట ఆలయ ఉత్తరద్వారం

- నేడు ఉత్తరద్వార దర్శనం
- ఆలయాలకు తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



కుంటాల: ముస్తాబైన దేవతామూర్తులు



భైంసాలోని వేంకటేశ్వరస్వామి ఆలయం



లక్ష్మణచాందలో వేణుగోపాలస్వామి ఆలయం



నిర్మల్‌లో విద్యుత్ కాంతులతో ఆలయం

నిర్మల్‌టౌన్: ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయాన్ని 450 ఏళ్ల కిందట నిమ్మనాయుడు కాలంలో నిర్మించారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు ఏటా ఇక్కడకు పట్టణంతోపాటు సమీపంలోని పలు గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం వద్ద టెంట్లు, బారికేడ్లు, క్యూలైన్లు, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకులు ప్రతిరోజు స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు వేంకటేశ్వరస్వామి అష్టోత్తర శతనామావళి, ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కూడారై మహోత్సవం వైభవంగా జరుపగా.. బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంతోపాటు, రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు.

కుంటాల: కుంటాలలోని శ్రీకృష్ణ దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్: స్వయం సహాయక సంఘాల మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం సులోచన అన్నారు. గురువారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో యాక్సివెంచర్, ఈడీడీ సౌజన్యంతో మహిళలకు గృహోపకారణాల తయారీ, నిజజీవితంలో అవసరమయ్యే సర్ఫ్, సబ్బులు, డిష్‌వాష్ పౌడర్, ఫ్లోర్‌క్లీనర్, టాయిలెట్ క్లీనర్ తయారీపై 26 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ముగిశాయి. ఈసందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఏపీఎం ధ్రువపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటీర పరిశ్రమగా ఏర్పడి వ్యాపారవేత్తలుగా రాణించాలని పేర్కొన్నారు. గుండంపల్లి యూబీఐ మేనేజర్ ఎ.రవికుమార్ బ్యాంకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి స్వాతి, సీసీలు కోడె ముత్యం, పోశెట్టి, వీఏవోలు రాముల, ముత్యం, మాస్టర్ శిక్షకులు రవి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు



రాజూరలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నర్సయ్య

లోకేశ్వరం: రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై రసాయనాలు అధికంగా వాడొద్దని ముధోల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని రాజూర రైతువేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పీఎస్‌బీ(భాస్వరం కరిగించే జీవన ఎరువు పద్ధతి)పై అవగాహన సదస్సు నిర్వహించారు. నర్సయ్య మాట్లాడుతూ పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పంటలకు తెగుళ్లు సోకితే.. సమీపంలోని వ్యవసాయాధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు విజయ్, కార్తీక్, ఏఈవో మౌనిక, తాజా మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, రైతులు ఉన్నారు.

దస్తురాబాద్: జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా సుడోమోనస్ ఫ్లోరిసెన్స్ అనే జీవ సంబంధ బ్యాక్టీరియాపై గురువారం మండలంలోని బూత్కూరు గ్రామంలో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ బ్యాక్టీరియా వరిలో పాము పొడ తెగులు, అగ్గితెగులు, ఎండుతెగులు, నారుకుళ్లు తెగులుతోపాటు పత్తి, పసుపు, మిరప, అరటి, మినుము, పెసర, వేరుశనగ, కంది తదితర పంటల్లో ఎండుఆకు తెగుళ్లు, కుళ్లు తెగుళ్లను అరికడుతుందని డీఏవో అంజిప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం దీని వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ సుజాత, ఏవో మానస, ఏఈవోలు తిరుపతి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలతోపాటు మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎస్టీయూ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, గోవింద్, గంగాధర్, బాలాజీ, రాజన్న, రాజేశ్వర్, ప్రేమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

- తులం బంగారం ఇంకెప్పుడిస్తారు?
- ఎమ్మెల్యే రామారావు పటేల్



బాసరలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బాసర: అర్హులైన పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్.. అధికారులను ఆదేశించారు. గురువారం బాసరలో 21 మందికి కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీ ముబారక్ చెక్కులు, 22 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఎప్పుడిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలు గూడు లేక ఇబ్బంది పడతుంటే.. సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. గత పాలకుల వైఖరి కారణంగా బాసర అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా రూ.42 కోట్ల నిధులను విడుదల చేసి.. అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాసరలో ఉపాధిహామీ నిధులు రూ.11లక్షలతో, టాక్లి గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

తాత్కాలిక భవనం పరిశీలన..

బాసరలో కేంద్రియ విద్యాలయం ప్రారంభించేందుకు అవసరమైన తాత్కాలిక భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈవిషయమై అధికారులు, నాయకులకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, తాజా మాజీ జెడ్పీటీసీ సావలి రమేశ్, మాజీ ఎంపీపీ విశ్వనాథ్ పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, ప్రతాప్‌రావ్, బిద్దు రమేశ్, నారా యణరెడ్డి, మధు పటేల్, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో 37 మంది లబ్ధిదారులకు రూ.11.50 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, కౌన్సిలర్లు తోట విజయ్, నాయకులు పోశెట్టి, భీంరావు, భూమేశ్, సుష్మరెడ్డి, లింగురాం, గాలి రాజు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

ముధోల్ సమీపంలో ఆటో బోల్తా పడి పది మంది గాయాలపాలై భైంసా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కుంటాల: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్ పేర్కొన్నారు. గురువారం కుంటాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు ఇప్పిస్తామన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వెంకగారి భూమయ్య, సోషల్ మీడియా కన్వీనర్ యోగేశ్‌కుమార్, సభ్యులు బి.రవికుమార్, రాజేందర్ రెడ్డి, దినేశ్, నవీన్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో గురువారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పున్నం చందు, సంతోష్‌రామ్, కడుగొల్ల లచ్చారాం, శ్రీనివాస్, బాబర్‌ఖాన్, జాబీర్, నర్సయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

షేక్ ఫాతిమా జయంతి

కడెం: మండలంలోని ఎలగడప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ సలీం.. విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు అందజేశారు. ఇందులో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, విద్యావలంటీర్ జ్యోతి, కాంగ్రెస్ నాయకుడు రహీం, నర్సింగ్ రమేశ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

భైంసాటౌన్: ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడిని పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మాటేగాంకు చెందిన ఓ బాలుడు బుధవారం రాత్రి ఇంటి నుంచి పారిపోయి.. భైంసా పట్టణంలోని బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు కనిపించాడు. అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు వివరాలు తెలుసుకొని బాలుడి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

‘కస్తూరిబా’లో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కుభీర్: మండలకేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడి పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ (ఎం.ఏ)తోపాటు బీఎడ్ పూర్తి చేసినవారు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

నర్సాపూర్ (జి): వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం మండలకేంద్రంలోని పలు దుకాణాలకు వెళ్లి లైసెన్స్ రెన్యువల్ చేశారు. దుకాణదారులు విధిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్, సిబ్బంది ఉన్నారు.

యువకుడికి సన్మానం

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన వాడికర్ నితిన్ ఇటీవల సీఐఎస్ఎఫ్ జవాన్‌గా ఉద్యోగం సాధించాడు. గురువారం ఆయనను కుంటాలలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు సాయి, భీమ శివ, సంతోష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఖానాపూర్: నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అవగాహన సదస్సులకు గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొని.. హాజరైన వారికి అటవీ హక్కు చట్టాలతోపాటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

11 నుంచి క్రికెట్ పోటీలు

ముధోల్: మండలకేంద్రంలో శనివారం నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు రాహుల్, గంగారెడ్డి, సునీల్, శరత్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశరుసుం రూ.వెయ్యి చెల్లించి పాల్గొనాలని సూచించారు. మొదటి బహుమతి రూ.11,111, ద్వితీయ బహుమతి రూ.5,555తోపాటు షీల్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల్గినవారు 98664 04276, 98661 41668, నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు చెక్కులు పంపిణీ

తానూరు: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఉదయం 11 గంటలకు 32 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ లింగంమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరవుతారని.. లబ్ధిదారులు సకాలంలో రావాలని కోరారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రామారావు పటేల్ అందిస్తారని తహసీల్దార్ మోతీరాం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో రావాలని కోరారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ముధోల్: బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై సంజీవ్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తనిఖీలు చేపట్టగా ముధోల్ మహాలక్ష్మి ఆలయం ఎదుట మిఠాయి బండార్ షాపులో ఒకరు బాలకార్మికుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన బాలుడి తల్లిదండ్రులను రప్పించి.. బాలుడిని వారికి అప్పగించారు. మిఠాయి బండార్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి కనిపించింది. జిల్లా నలుమూలల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కుమ్మరి జాగృతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆవిష్కరించారు. ఇందులో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూసారం గంగాధర్, పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, సభ్యులు నాగేశ్, సాయన్న, సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వెంకటపూర్‌తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలి



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వెంకటపూర్‌తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలని పలువురు తండావాసులు గురువారం నిర్మల్‌లోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, గ్రామస్తులు లచ్యానాయక్, అజ్మీర రాజు, రవి, జీవంత్‌రావు, రాజేందర్, వసంత్‌రావు, దేవేందర్, రామన్, గోవింద్, శ్యాంరావు, రమేశ్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

తానూరు: డ్రైవర్లు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ.. వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆర్టీవో అధికారులు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగంతోపాటు మద్యం తాగి నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వంటివి చేయవద్దని సూచించారు. సిబ్బంది సత్యంమూర్తి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కుంటాల: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు పట్టాలని ఆదేశించారు. అడిగిన వారికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న సీఐ నైలు

కుంటాల: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని భైంసారూరల్ సీఐ నైలునాయక్ పేర్కొన్నారు. గురువారం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దుకాణాల్లో చైనా మాంజా విక్రయాలు, వినియోగం అరికట్టాలని సూచించారు. సమావేశంలో ఏఎస్సై జీవన్‌రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఎన్నాళ్లకు పూర్తయ్యేనో..?



తానూరు: మండలంలోని బోల్సా గ్రామంలో ఆరేళ్ల కిందట రూ.13లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం ప్రారంభించారు. నిధులు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్.. పనులు మధ్యలోనే నిలిపివేశాడు. పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : నసీరుద్దీన్, ఎంపీవో, ఫోన్: 94412 55648

పల్లె దవాఖాన ప్రారంభమెప్పుడో?



కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడం లేదు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో 2023 ఆగస్టులో అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేయగా.. గతేడాది జనవరిలో నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని సిద్ధం చేశారు. పనులు చే పట్టిన కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు రూ.7.20 లక్షలు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ భవనం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ తీసుకునేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలో పల్లె దవాఖాన నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.